# ఇదీ ఒక టీ.వీ. క(బా)ధే!

కొత్తపల్లి ఉదయబాబు

(గత సంచిక తరువాయి)

"హలో!" అంది.

అనుకోకుండా లైన్ కలవడంతో కాత్యాయనికి సంతోషంతో నోట మాట రాలేదు.

"హలో! హలో!"

"హలో! ఎవరు మాట్లాడుతున్నారండీ?"

"నా పేరు కాత్యాయనండీ. హైదరాబాద్, పంజగుట్ట కాలనీ నుంచండీ, రాకెట్‌పార్కు ఎదురుగా 'స్వప్న' అపార్ట్‌మెంట్స్ నుంచండీ, మా బెడ్ రూమ్ లోంచే మాట్లాడుతున్నానండీ."

"హలో కాత్యాయని గారూ. మీ టీవీ వాల్యూమ్ కొంచెం తగ్గిస్తారా?"

"అలాగేనండీ. మీరు చాలా బాగుంటారండీ. మీ యాంకరింగ్ కూడా చాలా బాగుంటుందండీ."

యాంకర్ ఆనందం తట్టుకోలేక "చాలా థాంక్సండీ. మీరు ఏం చేస్తున్నారండీ?" అంది.

"ప్రస్తుతం మీతో మాట్లాడుతున్నానండీ."

"అబ్బా! అది కాదండీ. ఏదైనా జాబ్ చేస్తున్నారాండీ?"

"లేదండీ! హౌస్ నైఫ్ నండీ."

"హౌస్ నైఫా హౌస్ వైఫా..."

"మీరు కరెక్టుగానే విన్నారండీ. హౌస్ నైఫ్‌నే నండి. నాతో పెట్టుకుంటే పొడిచేయడమేనండీ."

"అలాగా! మర్డర్లు చేయడం మీ హాబీయా?"

"కాదండీ. ఎవర్ని మర్డరు చేస్తే ఎవరు వూరుకుంటారండీ? మావార్నేనండి. మీరు ఎప్పుడూ జుట్టు విరబోసుకునే ఉంటారేంటండీ? తల నిండా పేలాండీ? లేక తీరిక లేక వేసుకోరా!"

"అదేం లేదండీ. మొన్ననే తిరుపతి వెళ్లి తలనీలాలు యిచ్చి వచ్చాను. విరబోసిన జుట్టున్న విగ్గయితే ప్రోగ్రామ్ అయిన వెంటనే తేలిగ్గా తీసేయవచ్చు. ఇంతకీ నా పక్కన ఎవరున్నారో చూశారా?"

"చూశానండీ. బేవార్స్ బాబుగారు, నూలుపోగు మాలినిగారు."

"మరి వారితో మాట్లాడతారా? మీకు వారి మాట కావాలా? మూట కావాలా!"

"తప్పకుండానండీ. వారి మాట కావాలండీ. హలో! బేవార్స్ బాబుగారు! మన స్కారమండీ."

"హాయ్! నమస్తేనండీ. ఫస్ట్ 'కాలర్' ఎవరో మగవాడు అనుకున్నాను. తీరా జాకెట్టు వచ్చింది."

"అదేంటండీ అలా అంటారు?"

"కాలర్ మరి మగవాళ్లకే కదండీ ఉండేది!" తన జోక్‌కు తానే పకపకా నవ్వాడు బేవార్స్‌బాబు.

"మా యింట్లో అంతా మీ ఫాన్స్ అండీ. మీ సినిమా వస్తే చాలు నాలుగైదు సార్లు చూసేస్తామండీ. సరిగా తిండి కూడా తినమండీ. పైసలు సినిమాకు ఖర్చు పెట్టేశాక బియ్యం కొనుక్కోవడానికింక డబ్బులు ఉండవుకదండీ."

"మీ అభిమానానికి చాలా థాంక్సండీ. యిపుడు రిలీజయిన 'బేవార్సు బాబు — నూలు పోగు పాప' సినిమా చూశారాండీ."

"చూశామండీ. చాలా చాలా బాగుందండీ. హీరోయిన్ గారికి రెండే రిబ్బన్లు వాడి, చాలా అందంగా చూపించారండీ. మీరెలా ఫీలయ్యారండీ?"

"చాలా ఎంజాయ్ చేశానండీ. నావి ఇంకే సినిమాలు చూశారు?"

"అన్నీ చూశానండీ మీరు మా లవర్ బోయండీ. మా పేటలో అమ్మాయిలకైతే పగలు చూస్తే పగలే కలలోకి వస్తున్నారంట. తెగ పగటి కలలు కనేస్తున్నారండీ."

"అలాగా! చాలా చాలా థాంక్సండీ. సుమారు ఎంతమంది ఉంటారండీ?"

"పన్నెండు మందండీ."

"అలాగా అయితే వాళ్లకి టిక్కెట్లు పంపిస్తాను. నా సినిమా చూడమనండీ."

"మరి నాకు పంపరాండీ?"

"మీరు ఆల్రెడీ నా సినిమాలన్నీ చూసి దిబ్బిపోయారు కదండీ. మాలినితో మాట్లాడతారా!"

"ఇవ్వండి. హాయ్ నూగు మాలినీ! హౌ ఆర్ యూ?"

"అయామ్ ఫైన్! హౌవార్యూ?"

"అయామ్ ఫైనండీ. మీరు సినిమాలో చాలా అందంగా ఉన్నారండీ."

"థాంక్యూ! డూ యూ లైక్ మై పిక్చర్?" తనే తీసినట్టు అడిగింది మాలిని.

"చాలా నచ్చిందండీ. ఈ సినిమాకు మీకు అవార్డు తప్పకుండా వస్తుందండీ!"

"హౌ కెన్ యూ ఎక్స్‌పెక్ట్?"

"మీది లో-బడ్జెట్ పిక్చర్ కదండీ. అందుకని మీ నిర్మాత గార్కి, యిక ఏడ్చినా నవ్వినట్టు ఒక్క షాట్‌లో రెండేసి ఫీలింగ్స్ చూపినందుకు మీకు ఆస్కర్ అవార్డు వస్తుందండీ!"

"థాంక్యూ! థాంక్యూ వెరీ మచ్ మై డియర్ కాత్యా!"

"మాది లో-బడ్జెట్ పిక్చరని ఎందుకనుకుంటున్నారండీ?" అడిగాడు బేవార్సు బాబు.

"హీరోయిన్‌గారి ఫుల్ మేకప్ కనపడేలా చాలా తక్కువ బట్టలు వాడారు కదండీ. అందుకని!"

"యు ఆర్ రైట్ అండీ.



మా నిర్మాతగారు దేనికీ కాంప్రమైజ్ అవకుండా అద్భుతంగా తీశారండీ. మాకు డబ్బులివ్వకపోయినా, తనకు కావలసిన విధంగా మా చేత యాక్ట్ చేయించారు. అందుకే పిక్చర్ అంత సక్సెస్ అయింది."

"ఓ.కే! కాత్యాయనిగారూ! ఈ సినిమా నుంచి మిమ్మల్ని మూడు ప్రశ్నలడుగుతాం. వాటికి సరిగ్గా సమాధానం చెబితే మీకు చక్కని బహుమతి పంపిస్తామండి. అడగమంటారా?"

"ప్రైజ్ కచ్చితంగా వచ్చేసే లాంటి ప్రశ్నలడగండి."

"అలాగే. ఈ సినిమాలో హీరో గారి పేరేంటండి?"

"క్లూ యివ్వండి."

"మొదటి అక్షరం బా."

"బాబు" ఠక్కున అంది కాత్యాయని.

"కరెక్టండి. బాబుగారి ముందు ఉన్న నిక్ నేమ్ ఏమిటండి?"

"క్లూ యివ్వండి మేడమ్."

"క్లూ కావాలంటా—" అని యాంకర్ పకపకా నవ్వి, "బే అనేది మొదటి అక్షరమండి."

"బేటా..."

"కాదు. పోనీ రెండో అక్షరం కూడా క్లూ యిస్తున్నాను. వా!..."

"ఎందుకేడుస్తున్నారు?" బేవార్సు బాబు అడిగాడు, యాంకర్ని.

"నేను ఏడవడం లేదండీ బాబూ! మీ నిక్ నేమ్‌లో రెండో అక్షరాన్ని చెప్పానంతే!" అంది యాంకర్.

"బేవా... బేవార్స్" అంది గట్టిగా కాత్యాయని.

"అబ్బా! అపుడే ప్రైజ్ వచ్చినట్టుగా అంత సంతోషమే? ఈ మూడో ప్రశ్నకు కూడా కరెక్టుగా జవాబు చెబితే ప్రైజ్ మీదేనండీ."

"తేలికగా అడగండీ. చాలా టెన్షన్‌గా ఉంది!"

"ఈ సినిమాలో మాలిని గారి నిక్ నేమ్ ఏమిటండీ?"

"నూలుపోగు."

"ఖరెక్ట్. చూశారా... చెప్పలేను అంటూనే మీరు ప్రైజ్ గెలిచేసుకున్నారు. మీకు బహుమతిగా 'మూట'ను పంపిస్తాం తీసుకోండి. ప్రైజ్ గెలుచుకున్నందుకు మీరెలా ఫీలవుతున్నారండీ?"

"చాలా... చాలా ఆనందంగా! నేనింకా నమ్మలేకపోతున్నాను. ఎందుకంటే మా పక్కింటి పిన్నిగారు వాళ్ల పెళ్లయినప్పటి



నుంచీ ట్రై చేస్తున్నారంట. లైను కలవలేదంట. నేను యిలా చేశానో లేదో అలా కలిసిపోయింది."

"మీకు కంగ్రాట్స్ అండి. మీరెప్పుడూ ఇలాగే మాకు ఫోను చేస్తూ ఉండాలి. మీకు ఇంకా ఇండస్ట్రీలోకి దూసుకువస్తున్న తారలందరినీ పరిచయం చేస్తాం. ఫోను బిల్లు వేలల్లో కట్టేవారిలో మీరూ ఒకరు కావాలి. ఫోన్స్ చేసినందుకు థాంక్సండీ."

"ఇంకాసేపు మాట్లాడతానండీ. హీరో గారి కివ్వరా!" కంటి సైగతో యాంకర్ లైన్ కట్ చేయించి, "అరె! లైన్ కట్ అయిందండీ. మీరడిగిన మాట వేస్తున్నాం, చూడండి."

కాత్యాయనికి చాలా సంతోషం అనిపించింది. నోటికొచ్చిన అబద్ధాలన్నీ చెప్పింది తాను. బహుమతిగా వచ్చే మూటలో కనీసం పదివేలు ఉన్నా చాలు—అనుకుంది.

ఆ ఉత్సాహంతో అసలు భర్త ఎప్పుడు యింటికి వస్తున్నాడో, ఎప్పుడు వెళ్తున్నాడో కూడా పట్టించుకోవడం మానేసింది.

వెంకటేశ్వర్లు ఏదైనా అనబోతే, "మీకు నాతో మాట కావాలా! నేను బహుమతిగా సంపాదించే మూట కావాలా!" అనడం అలవాటు చేసుకుంది.

** ** **

"అదిరిందయ్యా వెంకూ! కొత్త సెల్లు, ఫోను బిల్లు... అద్భుతం."

"అదిరిందయ్యా వెంకూ! కొత్త టీ.వీ., కరెంటు బిల్లు... అద్భుతం."

టీ.వీ. ప్రకటనను అనుకరిస్తూ తోటి ప్లీడరు గుమాస్తాలు ఏడిపిస్తుంటే, వెంకటేశ్వర్లుకి కాలాల్సిన చోటే కాలింది.

వేలల్లో వచ్చిన కరెంటు బిల్లు, ఫోను బిల్లులు చెల్లించడానికి ఏ పార్టీ నెత్తినైనా చెయ్యి పెడదామా అంటే పార్టీలు రావడమే మానేశాయి. అటు తిండి ఖర్చు, యిటు డబ్బు ఖర్చు కూడా తమ ఖాతాలో చేరిపోతుంటే ఆ పార్టీ వాళ్లు తమ కళ్లు తెరిపించిన వారి వైపు తిరిగి పోసాగారు. పార్టీలు తన పార్టీ ఫిరాయించిన విషయం గ్రహించేసరికే, చెయి దాటిపోయింది. దానికి తోడు టీ.వీ., సోఫా సెట్ యిన్‌స్టాల్‌మెంట్ వాళ్లు యిచ్చే నోటీసులతో మతి పోయింది.

అన్నదమ్ముల మధ్య, అక్కచెల్లెళ్లు మధ్య, అంతెందుకు, ఉమ్మడి కుటుంబాల మధ్య అతిబలహీనంగా ఉన్న బాంధవ్యాల బంధాలను పూర్తిగా తెగిపోయేలా చేస్తున్న టీ.వీ. సీరియల్స్, ప్రపంచంలోని విష సంస్కృతిని పోషిస్తూ, తమదైన శైలిలో సమర్థించుకుంటూ ముందుకు పోతున్న సినీరంగపరిశ్రమకు చెందిన కార్యక్రమాలు, బహుమతులకు ఆశపడి వేలకు వేలు బిల్లుల రూపంలో చెల్లించాల్సి వచ్చి, కుటుంబ ఆర్థికవ్యవస్థను ఛిన్నాభిన్నం చేస్తున్న టీ.వీ. ప్రోగ్రాములు, 'కళాపోషణ'కు 'ఎంజాయ్' అనే పదాన్ని పర్యాయపదంగా వాడే బొద్దూడని కుర్ర హీరో లిచ్చే స్టేట్‌మెంట్లూ, "ఈవిడ అమ్మ అయితే కొడుకే ఆవిడ మొహాన ఉమ్మేస్తాడు" అనిపించే వస్త్రధారణతో వలస వచ్చిన హీరోయిన్లు, ఆంధ్రులమై ఉండి మాతృభాష పట్ల అంధులమై ఉచ్చారణ ఎలా చేయాలో కూడా తెలియక కృతకమైన మాటలతో, తమ వెకిలివేషాలతో తామే కార్యక్రమంగా రూపొందిస్తున్న యాంకర్లు... వీటన్నింటికీ మూలకారణం ఏమిటో?... అసలు తన సమస్యకు పరిష్కారమార్గం ఎలాగో కనుగొనాలని నిర్ణయించుకున్న వెంకటేశ్వర్లు, ప్రస్తుతం తాను బయల్దేరబోయే ముహూర్తం కోసం పంచాంగాలు తిరగేస్తున్నాడు. అతను ముహూర్తం నిర్ణయించుకునే లోపల మనం కాసేపు టీవీ బాధను అనుభవిద్దాం రండి. ఓ పనై పోద్దీ!!